క్లుప్తంగా

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత



మొబైల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: బస్సులో మొబైల్‌ఫోన్ మర్చిపోయి దిగిపోయిన వ్యక్తికి తిరిగి ఆర్టీసీ సిబ్బంది అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సులో ఆసిఫాబాద్ నుంచి చంద్రాపూర్‌కు వెళ్తున్న చంద్రాపూర్‌కు చెందిన విజయలక్ష్మి మొబైల్ ఫోన్ మర్చిపోయి బస్సు దిగింది. మొబైల్ ఫోన్‌ను గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు విషయం తెలిపారు. అప్పటికే తన ఫోన్ పోగొట్టుకున్నట్లు విజయలక్ష్మి ఫిర్యాదు చేయడంతో మహారాష్ట్రలోని రాజురా బస్‌స్టేషన్‌లో కండక్టర్ రమేశ్ బాధితురాలికి పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగించారు.

ఉత్సాహంగా బాలమేళా



బాలమేళాలో పాల్గొన్న చిన్నారులు, పోషకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో ఆసిఫాబాద్ సెక్టార్‌లోని 26 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు, తల్లిదండ్రులతో ఉత్సాహంగా బాలమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీడీపీ తిరుమల, సూపర్‌వైజర్ పెంటుబాయిలు హాజరయ్యారు. స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఈశ్వరీబాయి

కెరమెరి: మండలంలోని కొలాంగూడలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి బారిక్ రావుకు చెందిన ఇల్లు దగ్ధం కావడంతో మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబానికి దుప్పట్లు, బియ్యం, పప్పు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

టీయూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



చంద్రశేఖర్

పెంచికల్‌పేట్: మండల టీయూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సతీశ్, ఉపాధ్యక్షులుగా షేక్ అబుత్సాల, సుమిత, కోశాధికారిగా భాగ్యలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వనిత, మహిళా కమిటీ కన్వీనర్‌గా వెన్నెలను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయాలని సంఘం జిల్లా ప్రతినిధి రాజ్ కమలాకర్ రెడ్డి సూచించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ స్థలం పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న తహసీల్దార్

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామానికి నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ స్థలాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు గ్రామస్తులతో కలిసి మంగళవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన బబ్బెర చంద్రు భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందజేయడంతో అధికారులు, గ్రామస్తులు అభినందించారు. ఆయన వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా, ఆర్‌ఐ సురేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు ఉన్నారు.

‘చదవడం, రాయడం రావాలి’

కెరమెరి: విద్యార్థులందరికి చదవడం, రాయడం రావాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొఠారి పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టరుతో పాటు ఎండీఎం, సీసీఈ, టీచర్స్ డైరీ తదితర రికార్డులు నమోదు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నూతన మెనూ పాటించాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ ఆధారంగా విద్యా బోధన చేయాలన్నారు. హెచ్‌ఎం నందకుమార్ ఉన్నారు.

దిగుబడి.. దిగులు!

- వర్షాభావంతో తగ్గిన వరి పంట దిగుబడి
- ఏటా అన్నదాతలకు నష్టాలే
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- జిల్లాలో 56వేల ఎకరాల్లో సాగు



తలోడిలో వరి పంట పడుతున్న రైతులు

కౌటాల: అన్నదాతలు ఏటా కష్టాలు చవిచూస్తున్నారు. వరి నారుమడిలో విత్తనాలు చల్లినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు నష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్‌లో వర్షభావం కారణంగా వరి పంట దిగుబడి తగ్గింది. పెట్టుబడి పెరిగినా దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా రెండెకరాల్లో వరి సాగు చేయగా 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది తెగుళ్ల కారణంగా 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు లేవని వరి రైతులు వాపోతున్నారు.

ఏటా నష్టాలే..

జిల్లాలో సాగు చేస్తున్న పంటలకు నీరు అందించేందుకు భారీ ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వరి పంట పొట్ట దశలో ఉన్న క్రమంలో వరుణుడు ముఖం చాటేయడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. జిల్లాలోని రైతులు ఇటీవల వరి కోతలు పూర్తి చేసి ప్రస్తుతం పంట నూర్పిడి చేస్తున్నారు. చెరువులు, బావులతో వరికి చివరి దశలో సాగునీరు అందించిన పంటలకు కొంత దిగుబడి బాగున్నా.. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసిన పంటలో దిగుబడి తగ్గింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం, తెగుళ్లు రైతులను కుదేలు చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 56వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 20 నుంచి 25 శాతం వరకు పంట దిగుబడి తగ్గింది.

తగ్గిన దిగుబడి..

రైతులు ఏటా అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా నష్టపోతున్నారు. ఈ ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు కురువడంతో ఈ సారి రైతులు కొంత ముందుగానే వరి పంట సాగు చేశారు. అనంతరం కురిసిన వర్షాలకు పంటలు కళకళలాడటంతో అన్నదాతలు దిగుబడులపై ఆశలు పెంచుకున్నారు. కానీ అకాలంలో కురిసిన వర్షాలు ఆశలను ఆడియాసలు చేశాయి. సకాలంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం పడింది. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు వర్షాలు కురవలేదు. దీనికి తోడు తెగుళ్ల సోకాయి. వరి పంటకు దోమ, పచ్చపురుగు, చిలుకపురుగు ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేసింది. దీంతో పంటకు ఆశించిన పురుగును నాశనం చేయటానికి రెండుసార్లు అధికంగా పురుగు మందులు వాడారు. వ్యవసాయ బావుల ఆధారంగా కొంత మంది రైతులు సాగు నీరు అందించగా.. వర్షధారం పై ఆధారపడిన రైతుల వరి పొలాలు ఎండిపోయాయి. వరి కోతల సమయంలో వ్యవసాయాధికారులు నిర్వహించిన వరి పంట కోత ప్రయోగాల్లో సైతం ఈసారి పంట దిగుబడి తగ్గిందని గుర్తించారు. ప్రభుత్వం వరి పంటకు రూ. 5వేలు మద్దతు ధర కల్పించి అన్నదాతలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి తగ్గుతోంది..



ఈసారి నేను మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. సుమారు 70వేల వరకు పెట్టుబడి పెట్టాను. సకాలంలో వర్షాలు లేక పంటకు చాలా రకాల తెగుళ్ల వచ్చాయి. ఎన్ని రకాల పురుగు మందులు వాడినా లాభం దక్కలేదు. గతంలో ఎకరాకు 40 బస్తాలు వచ్చేవి. ఇప్పుడు 20 బస్తాలు వచ్చేది గగనమే. చేతిలో డబ్బు లేక అప్పులు చేసి పంట సాగు చేశాను. కనీసం వడ్డీ కట్టడానికి పెట్టుబడి రావడం లేదు. – ఆనంద్, రైతు, యాపలగూడ

రూ.5వేలు ధర కల్పించాలి



నేను రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. ఎకరాకు రూ. 18వేల నుంచి రూ. 20వేల వరకు పెట్టుబడి పెట్టేవాన్ని. ఈసారి వర్షభావం కారణంగా అదనంగా ఎకరాకు రూ. 5వేల వరకు ఖర్చు చేశాను. కానీ పంటకు తెగుళ్ల సోకడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం వరి క్వింటాల్‌కు రూ. 5వేలు ధర కల్పించాలి.

– ఎ. సత్తయ్య, రైతు, తలోడి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తుందని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 చొప్పున జిల్లాలో 7వేలు ఇళ్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు ప్రభుత్వానికి అందించాలన్నారు. ఇందిరమ్మ యాప్‌లో నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. హౌసింగ్ డీఈ వేణుగోపాల్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



నమోదు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి సేకరించిన వివరాలను స్పష్టంగా ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్‌కమిషనర్ అంజయ్య ఉన్నారు.

పోటీల్లో సింగరేణిని అగ్రస్థానంలో నిలపాలి

- బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్
- 91వ కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

రెబ్బెన: సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు ఏరియాలతో సంబంధం లేకుండా కోల్ ఇండియా పోటీల్లో సింగరేణి సంస్థను అగ్రస్థానంలో నిలపాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. 91వ డబ్ల్యూపీఎస్‌అండ్‌జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో కంపెనీ లెవల్ క్రికెట్ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ చిన్న ఏరియా అయినా ఏరియాపై నమ్మకంతో కంపెనీ స్థాయి పోటీలను నిర్వహించేందుకు అవకాశం కల్పించటం సంతోషకరమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. భీమన్న స్టేడియంలో జరిగిన పోటీల్లో బెల్లంపల్లి, మందమర్రి జట్లు, శ్రీరాంపూర్ జట్లు గెలుపొందాయి. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్, పర్సనల్‌మేనేజర్ తిరుపతి, సీనియర్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, సివిల్ ఎస్ఈ మదీనా బాషా తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

‘ఏరియా సమస్యలకు పరిష్కారం చూపుతాం’

రెబ్బెన: స్ట్రక్చర్ కమిటీ సమావేశం ద్వారా గుర్తింపు సంఘం నాయకులు ఏరియా యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు ఏరియాలో నెలకొన్న పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లకు కలుషిత తాగునీరు సరఫరా అవుతోందన్నారు. భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, జీఎం కమిటీ సభ్యులు శేషశయన రావు, రాజేశ్, అనంద్, జగ్గయ్య, శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై చర్చిస్తున్న అధికారులు, నాయకులు

ఇళ్ల స్థలాల కోసం వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులకు, న్యాయవాద గుమాస్తాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుకు మంగళవారం జిల్లా కేంద్రంలో తన నివాసంలో న్యాయవాదులు వినతిపత్రం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ మాట్లాడుతూ 1917లో ఏర్పడిన న్యాయస్థానంలో ఎందరో న్యాయవాదులు సేవలు అందించారని, జిల్లా కేంద్రంలో పలువురు న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు అద్దెకు ఉంటున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో న్యాయవాదులు సురేశ్, వెంకటేశ్వర్లు, చందన్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విశ్వప్రసాద్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

‘లాకప్‌డెత్ కారకులపై చర్యలు తీసుకోవాలి’

వాంకిడి: ఇటీవల మహారాష్ట్రలోని పర్భని పట్టణంలో భారత రాజ్యాంగాన్ని చింపేసిన ఘటనలో గళం విప్పిన న్యాయవాద విద్యార్థి సోమ్‌నాథ్ వెంకట్ సూర్యవంశి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్ ఎదుట సర్వీస్ రోడ్డుపై దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ లా విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని అరెస్టు చేసి లాకప్ డెత్ చేయడం అమానుషమైన చర్య అన్నారు. అనంతరం రాజ్యాంగం, సోమ్‌నాథ్ సూర్యవంశి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, నాయకులు విలాస్, రాజేంద్రప్రసాద్, మహేశ్, హంసరాజ్, శ్యామ్‌రావు, అరుణ్, నూతన్, ప్రతాప్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

‘కొలవార్‌లపై ఆరోపణలు సరికాదు’

బెజ్జూర్: కొలవార్‌లపై కొలాం సంఘం నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ కొలవార్ సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏ వద్ద ధర్నా కార్యక్రమంలో కొలాం సంఘం నాయకులు కొలవార్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సంఘం గౌరవ అధ్యక్షుడు అత్రం బక్కయ్య, సిడాం సకారాం, ఉపాధ్యక్షులు మేకల శ్యామ్‌రావు, మల్లేశ్, పోషం, జయరాం, సురేశ్, గణేశ్, పోషం, సేగం మదునయ్య, వసంత్, లక్ష్మయ్య, చంటి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్

రైతులపై కేసులు ఎత్తివేయాలి

ఆసిఫాబాద్: లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రైతులపై కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైల్‌లో నిర్బంధించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ విధానాలకు నిరసనగా కేటీఆర్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాలతో వినతిపత్రం సమర్పించామన్నారు. నాయకులు అలిబిన్ అహ్మద్, రవీందర్, సాలం, బలరాం నాయక్, సీహెచ్ రవి, నిసార్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: లగచెర్లలో రైతుల అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, దళిత గిరిజన రైతుల పట్ల అణిచివేత చర్యలు చేపడుతుందన్నారు. అసెంబ్లీ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంగళవారం బీజేపీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మండలంలో ఆరుగురికి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్, నాయకులు సత్తయ్య, భూమయ్య, చందు, సునీల్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



పాఠశాల తనిఖీ చేస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం పెట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఈఎస్‌ఐ పాత క్వార్టర్స్ వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. పట్టణానికి చెందిన చందు, సురేశ్, శ్రీనివాస్, నరేశ్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 4700లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, జూదం, మట్కా ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

బెజ్జూర్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మార్థిడి గ్రామానికి చెందిన ధూపం రాకేశ్ ఇటీవల కాలంలో జరిగిన పోటీ పరీక్షల్లో కానిస్టేబుల్, రైల్వే, టీచర్ (ఎస్జీటీ), రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ నాలుగు ఉద్యోగాలు సాధించాడు. దీంతో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాకేశ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల కన్వీనర్ బూస సారయ్య, ఖాజా మోయినొద్దీన్, గోలేటి కొండయ్య, మండల యూత్ కన్వీనర్ దుర్గం తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాకేశ్‌ను సన్మానిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ఉచిత కుట్టు మిషన్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: మైనార్టీ మహిళల నుంచి ఉచిత కుట్టు మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మైనార్టీ మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆహార భద్రత కార్డు కలిగి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా శిక్షణ పొందిన టైలర్ సర్టిఫికెట్, కనీస విద్యార్హత 5వ తరగతి కలిగి ఉండాలని పేర్కొన్నారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులు ఈనెల 31వ తేదీ సాయంత్రం 5.30 గంటలలోపు టీజీవోబీఎంఎస్ వెబ్‌సైట్ www. tgobmms. cgg. gov లో దరఖాస్తు చేసుకుని ప్రతిని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

మెనూ అమలులో మినహాయింపునివ్వాలని వినతి

ఆసిఫాబాద్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో కామన్ మెనూ ఇంప్లిమెంట్ చేయడంలో మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూల్ కామన్ మెనూ ఇంప్లిమెంట్ చేయడానికి తగినంత సిబ్బంది లేరని, డీపీసీ రేట్లకు అనుగుణంగా జనరల్ సప్లయ్ లేదన్నారు. దీంతో పాటు గ్యాస్ సరఫరా తగినంత లేకపోవడంతో పాటు సౌకర్యాలు లేక పోవడంతో కలిగే ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం జిల్లా కన్వీనర్ లింగాల రాజశేఖర్, కోకన్వీనర్ ఎస్‌ఏ హబీబ్, పొన్నకుమార్, వసతి గృహాల సంక్షేమ అధికారులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వసతి గృహాల సంక్షేమ అధికారులు

మ్యూజియంలో సౌకర్యాలు కల్పించాలి

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఉన్న మ్యూజియంలో సౌకర్యాలు కల్పించాలని కుమురం భీం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీటీడీవో రమాదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మ్యూజియంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్